

నవంబరు 2013
రూ. 12/-

# విపుల
విశ్వకథా వేదిక

పెద్దలు చదవాల్సిన పిల్లల కథలు

* గైడి మపాసా కథ
తల్లి - కొడుకు ... 14
* చినువా అచెబె కథ
అకుపికె ... 42

మలయాళ కథ

# డైనోసార్ బిడ్డ

- ఇ. హరికుమార్

"నిన్న రాత్రి ఆ పిల్ల డైనోసార్ మళ్లీ వచ్చింది డాడీ" రాజీవ్ అన్నాడు. "చాలా సేపు వుంది. కిటికీ అవతల నిలబడి నన్ను చూస్తూనే వుంది"

పొద్దున టిఫిన్ టైం అంటే, రాజీవ్ కథలు చెప్పే టైం అన్నమాట. వాడి కలల కథలు చెబుతాడు. లేలేత ఎండ కిటికీలో నుండి భోజనంబల్ల మీద పడే వేళకి కల లోని అంశాలు గుర్తుకు వస్తాయి. ఆ కథలు వినడం తండ్రిగా మోహన్ బాధ్యత. అతడు మాత్రమే రాజీవ్ శ్రోత. వాడి తల్లి శైలజ అప్పుడు వంటపనిలో వుంటుంది.

"ఆ పిల్ల డైనోసార్ కాసేపు నన్ను చూస్తూ నిలబడింది డాడీ" వాడు కొనసాగించాడు.

"దానికి నేను నచ్చినట్టున్నాను. అది కిటికీ ఊచల మధ్య నుండి నాలిక జాపి నన్ను నాకింది. చాలా మెత్తగా వుంది దాని నాలిక. దాని ముఖం ఎంత అందంగా వుందో... ఒక కుక్కపిల్ల ముఖంలా.."

ఇది రెండో రోజు కథ. మొదటి రోజు, అంటే మొన్న అది రెండో అంతస్తులోని రాజీవ్ పడక గదిలోకి చూస్తూ నిలబడిందట వెనక కాళ్ల మీద.

పొట్టిగా వుండే ముందుకాళ్ళు గోడమీద గట్టిగా ఆన్చి నిలబడిందని చెబుతున్నాడు రాజీవ్. ఇంచుమించు ఇరవై అడుగుల ఎత్తుందట! అయినా అది ఒక పిల్ల డైనోసారట! అందమైన దాని ముఖం మీద ముద్దు పెట్టాలని అనిపించిందట వాడికి. కానీ ముద్దు పెట్టలేదట మమ్మీకి కోపం వస్తుందేమోననే భయం వల్ల.

ఇది ఒక కొత్త 'సిరీస్' ప్రారంభం. కలలో కనబడి వాడ్ని స్నేహించిన, భయ పెట్టిన జంతువుల సంఖ్య తక్కువేం కాదు. వాటిలో పిల్లి మొదలుకొని ఏనుగు వరకు అన్ని జంతువులూ ఉన్నాయి. కానీ ఇంత పెద్ద జంతువును చూడడం ఇదే మొదటి సారి.

పాత్రలు ఎంత పెద్దవైతే కథ అంత దీర్ఘమవుతుంది. ఎక్కువ రోజులు అదే కథ చెబుతాడు.

"నువ్వు ఇంకా దోశ తినలేదేంటి? " శైలజ అడిగింది.

కానీ, వాడు పట్టించుకోకుండా, డైనోసార్ గురించి వర్ణిస్తూనే ఉన్నాడు.

"దాని వెనకకాళ్లు లావుగా ఉంటాయి. ముందుకాళ్లు చిన్నవి. అవి వేలాడదీస్తూ నిలబడింది. పాపం! దానికి ఆకలి వేసి వుండాలి. అది ఏం తింటుంది డాడీ? "

మోహన్‌కు తెలియదు. గడ్డి కావచ్చు. పదికోట్ల సంవత్సరాల క్రితం భూమ్మీద గడ్డి ఉండేదా? ఏమో అదీ తెలియదు.

"నువ్వు దోశ తింటావా... తినవా? ఆటో వచ్చే టైం అయింది. ఆటో వచ్చాక పరిగెడతావు" అంటూ తండ్రి కసిరాడు.





వాడి స్వప్నానికి ఆటంకం కలిగింది. గబగబా దోశ తినడం మొదలుపెట్టాడు.

"మమ్మీ నా బ్లూ సాక్స్ చూశావా? నిన్న బ్లాకు సాక్సుతో వెళ్లాను కదా పనిష్‌మెంటు ఇచ్చారు"

"లంచ్ బాక్సు ఎక్కడా? " శైలజ హడావిడి- "సాయంత్రం రాగానే కడగడానికి పడేయమని రోజూ చెబుతున్నానా లేదా? ఇ దేంటీ నిన్న నువ్వు లంచ్ తినలేదా...? "

ఇక ఒకటే హడావిడి. ఎనిమిదిన్నరకు ఆటో వచ్చి వెళ్లినంత వరకు శైలజ ఒక రంగులరాట్నంలా తిరుగుతూనే వుంటుంది. ఆటో వెళ్లగానే కుర్చీలో కూలబడింది.

"హమ్మయ్య... ఒకడితోనే ఇంత హడావిడి. ఇద్దరో ముగ్గురో వుండి వుంటే..."

"మాట్లాడకు" మోహన్ అన్నాడు.

"ఇక్కడ దానికన్నా ముఖ్యమైన విషయాలున్నాయి ఆలోచించడానికి. ముఖ్యంగా డైనోసార్ ఏం తింటుందన్నది ఆలోచించాలి. సాయంత్రం వాడు వచ్చేలోగా అది తెలుసుకోవాలి.

ఈ రోజు రాత్రి వాడు ఒక పిల్ల డైనోసార్‌కు తిండి పెట్టాలి. పైగా, నా పనులు ఉండనే ఉన్నాయి. యాభైవేలు ఖరీదు చేసే బేటరీ ఎలిమినేటర్లు అమ్మాలి"

ఢిల్లీ నుండి వచ్చిన సేల్స్‌మేన్ మాటలతో పడగొట్టేశాడు. కేవలం రెండు జిల్లాల్లోనుండి సంపాదించిన ఆర్డర్లు చూపాడు. అవి నలభై వేల పైమాటే.

మోహన్ ఆలస్యం చేయలేదు. వెంటనే ఆ కంపెనీ ఏజెన్సీ తీసుకున్నాడు. చాలా ఆకర్షణీయమైన ఒప్పందం. మొదటి ఆర్డర్ యాభైవేలది కావాలి. ఆ తరువాత ప్రతి నెలా పదివేలు ఖరీదు చేసే బేటరీలు తీసుకోవాలి అంతే.

ఆ బేటరీకి చాలా గిరాకీ వుందట. ఆ సేల్స్‌మ్యాన్ మాటలకు బోల్తాపడిన మోహన్ ఇప్పుడు యాభై వేలు స్టాకుతో దుకాణాల చుట్టూ తిరుగుతున్నాడు.

"బేటరీ ఎలిమినేటరా? వద్దండి వద్దు. మా వద్దే చాలా పడి ఉన్నాయి. ఎప్పుడో ఒకటో రెండో అమ్ముడు పోతే అదృష్టం. ఇప్పుడు డిమాండు ట్రాన్స్‌ఫార్మర్లకండి"

దుకాణం వాళ్ళ మాటలవి.

'అయితే... సేల్స్‌మేన్‌గా తను చేతకానివాడై వుండాలి. లేదా అమ్మే వస్తువుకు డిమాండు లేకపోవాలి. కానీ అప్పు ఇచ్చిన వారు ఊరుకోరుగా... డబ్బు కట్టమని వత్తిడి చేస్తున్నారు గడువు దాటి పోయిందట' అని తనలో తానే గొణుక్కున్నాడు మోహన్.

మరో సమస్య ఇంటిది. పట్నంలో ఒక చిన్న ఇల్లు దొరికింది అద్దెకి. కాని అయిదు వేలు అడ్వాన్స్ కట్టాలి. అద్దె ఇప్పుడు కడుతున్నంతే. కానీ తిరగడం తగ్గుతుంది. ఇల్లు ఖాళీ చేస్తానని ఇంటిగలాయనకి చెప్పేశాడు. అతడు అడ్వాన్సు తిరిగి ఇస్తేనే కొత్త ఇంటికి అడ్వాన్సు ఇవ్వగలడు.

"నేను టీ తాగుతాను" శైలజ అంది.

"సమస్యలు ఎక్కువైనప్పుడు ఏం చేయాలో తెలుసా...? " టీ తాగుతూ అంది శైలజ.

"మా తాతగారు చెప్పేవారు. సమస్యలను వాటి ప్రాధాన్యతను బట్టి ముందు వరసగా రాసుకోవాలి. ఆ తరువాత అతి ముఖ్యమైన సమస్యను ముందు పరిష్కరించాలి. ఆ తరువాత మరొకటి. అలా చేస్తే సులువుగా ఉంటుంది. పోనీ, ముందు ఒక దోశ పట్టుకురండి. ఆ చేతితోనే మరో దోశ వేసేయండి పెనం మీద"

మోహన్ దోశ తీసుకొచ్చాడు.

"నాకు ఎన్నెన్ని అద్భుత శక్తులు వున్నాయో చూశావా? ఇక్కడ పెళ్ళానికి దోశ వేసి పెట్టి టైం వృధా చేస్తున్నాను. మీ తాతకి ఇలాంటి ఇబ్బందులుండేవి కావని అనుకుంటా..."

"లేదు... లేదు. ఖచ్చితంగా ఉండేవి కాదు. ఎందుకంటే తాత పొద్దున చద్దన్నం తినేవాడు. అంతేకాదు. పెళ్ళికాని ఇద్దరు చెల్లెళ్ళు అమ్మమ్మతోనే ఉండేవారు. అది పోనీయండి. ఇప్పటి ముఖ్య సమస్య ఏమిటి? "

"డైనోసార్ ఏం తింటుంది? "

"ఏమిటీ..? "

"అదే, డైనోసార్ ఏం తింటుంది? ఒక పిల్ల డైనోసార్ ప్రతిరోజూ ఏం తింటుంది? ఇది రాజీవుగాడి డ్రీం సిరీస్‌లోని అతి ముఖ్య సమస్య. వాడి సిరీసులు, ఒక్కొక్కటి ముగిసేలోగానే నేను ఆ విషయంలో డాక్టరేటు తీసుకుంటాను. కానీ ఇది చాలా చిక్కు సమస్యలా ఉంది"

"ఓ ఇదో సమస్యా" ఫక్కున నవ్వింది శైలజ. "జూకు వెళ్లండి. వాళ్ళు ఏం పెడుతున్నారో కనుక్కోండి"

మోహన్ మాట్లాడలేదు. శైలజకి అర్థం కాలేదు కాబోలు అని అనుకున్నాడు. డైనోసెరెస్ అనుకుంటోంది కాబోలు... గ్రంథాలయానికి వెళ్ళి ప్రాచీనయుగంలోని జంతువుల వివరాలు తెలియపరిచే పుస్తకాల ముందు కూర్చుని ఆలోచించాడు. ఎక్కడో ఏదో లోపముంది. అంతా తలక్రిందులుగా ఉన్నట్లుంది. ఏం చేసినా కలిసిరావడం లేదు. మార్వాడి తనను దోచుకుంటున్నాడని అనిపించి, అతనితో గొడవ పడి ఉద్యోగం పోగొట్టుకున్నాడు. ఆ రోజు నుండి బిజినెస్‌మేన్ వేషం వేస్తున్నాడు. ఈలోగా మూడు కంపెనీల పేర్ల మీద విజిటింగ్ కార్డులు కొట్టించాడు. మేకులు మొదలుకుని టీవీ పార్టుల వరకు అన్ని వ్యాపారాలూ చేశాడు. ఏ వ్యాపారమైనా నష్టంతోనే ముగిసింది. గిరాకీ ఉండే పార్టు ఏదైనా అతడు తెచ్చి అమ్మటం మొదలు పెట్టగానే డిమాండు పడిపోతుంది.

మార్వాడి వద్ద పని చేసినప్పుడు లక్షలు ఖరీదు చేసే వస్తువులు అమ్మిన తన పని



తనం ఏమైందీ? ఎక్కడో ఏదో లోపముంది- అదే అతని ఆలోచన.

వివిధ దశల్లో బతికిన డైనోసార్లు తనను చూసి వెక్కిరిస్తున్నట్లు తోచింది అతనికి. బీభత్స ముఖాలతో, మాంసభక్షులైన, శాకాహారులైన భీమాకారాలు గల జంతువులు నడిచినప్పుడు భూమి వణికింది. తరువాత మంచుయుగంలో తిండి దొరకక ఒక్కొక్కటిగా అవి చనిపోయాయి. చివరి డైనోసార్ మంచు నిండిన మైదానాల్లో నిస్సహాయంగా తలయెత్తి చూడటం అతని మనో నేత్రాలకు కనబడింది. కొంత వెచ్చదనం కోసం... తిండి కోసం నిస్సహాయ స్థితిలోని ఎదురుచూపు...

ఇప్పుడు ఆరు కోట్ల సంవత్సరాల తరువాత ఒక ఆరేళ్ల పిల్లవాడు, అందమైన ముఖంతో మెత్తని నాలికతో కూడిన ఆ జంతువు గురించి చెబుతున్నాడు. తన పెంపుడు జంతువుగా ఉంచుకోవడం కోసం కిటికీ అవతల కాపలా కోసం యుగాలుగా దీర్ఘ నిద్రలో ఉన్న ఆ జంతువు గురించి మాట్లాడుతున్నాడు.

ఒక జ్యోతిష్కుడ్ని కలిస్తే మంచిదని అనుకున్నాడు. సహజంగా అతడు హేతువాది. తన హేతువాదానికి అతీతంగా ఏవేవో జరుగుతున్నాయని తోచింది. అదేమిటో తెలుసుకోవాలనే తపన అతనిది. అప్పుడెప్పుడో ఎవరి కోసమో, ఒక జ్యోతిష్కుడి ఇంటికెళ్ళిన గుర్తుంది.

ఇప్పుడూ అలాగే కూర్చుని వున్నాడు. జ్యోతిష్కుడు- అదే పులిచర్మం మీద, తెల్ల పంచెతో గోల్డెన్ ఫ్రేం కళ్లద్దాలతో-

"ఈ జాతకాలు అసలు కలవవు. కలప కూడదు"

ఎదురుగా కూర్చుని ఉన్న ముసలి వాడితో అంటున్నాడు జ్యోతిష్కుడు.

"అలా అనేశారేంటి గురూగారూ? ఎలా గోలా కలపలేరా? " ముసలివాడి మాటల్లో



నైరాశ్యం ప్రస్ఫుటంగా కనబడింది.

"నీ ఆత్రుత నాకు అర్థమైంది. ఆడపిల్లకి ఇరవై ఎనిమిదేళ్ళు దాటాయి. నిజమే. కాని ఈ రెండు జాతకాలు కలిపితే ఎనిమిది నెలల తరువాత విడిపోతారు"

ఇరవై ఎనిమిది దాటిన ఆడపిల్ల! అంతా కలిశాయి. పెళ్ళి అయిపోతుందని అనుకున్నాడు. పాపం! జాతకాలు కలవలేదు. ఇంకా వెతకాల్సిందే. నిరంతర అన్వేషణ...

"ఏం కావాలి? "

"ఒక్కసారి ఉలిక్కి పడ్డాడు మోహన్. బ్రీఫ్‌కేసు నుండి జాతక చక్రం తీసి ఇచ్చాడు. జాతక చక్రాన్ని పరిశీలించిన జ్యోతిష్కుడి ముఖ కవళికలు మారాయి. కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"ఎవ్వరి జాతకం ఇది? నీదేనా...? "

"అవును"

"సరిగ్గా మూడేళ్ల క్రితం మీ ఉద్యోగం ఊడిపోయింది. గొడవ పడి ఉద్యోగం మానేశారు. నిజమేనా? ప్రస్తుతం ఉద్యోగం లేదు కదూ? "


మోహన్ మాట్లాడలేదు.

బిజినెస్ ఉద్యోగం కాదు కదా!

"ఇప్పుడు కేతు దశ. గత నాలుగు సంవత్సరాల ఏడు నెలలుగా" ఏవో లెక్కలు వేసి జ్యోతిష్కుడు అన్నాడు. "మరో రెండున్నర సంవత్సరాలు ఇలాగే ఉంటుంది. గుణం కనబడదు. జాగ్రత్తగా ఉండాలి. ధననష్టమూ, మాననష్టమూ జరగవచ్చు మీరు ఏం చేసిన నష్టమే..."

జోతిష్కుడి మాటలు విని మోహన్‌కి ఆశ్చర్యం కలిగింది.

అతడు ఆలోచించాడు. అయితే ఇదంతా ముందుగానే వ్రాసిపెట్టి ఉందన్న మాట. ఫలానా సంవత్సరం, ఫలానా గడియలో పుట్టిన పిల్లగాని, పిల్లవాడుగాని ఏమవుతాడనేది వ్రాసిపెట్టి ఉంది. బహుశా, డైనోసార్లూ ఇతర ప్రాచీన జీవులూ బ్రతికిన కాలానికి ముందుగానే ప్రపంచపు భవిష్యత్తు ఇలా ఉండాలని సృష్టికర్త నిర్ణ



యించి వుండవచ్చు

"మీరు భవిష్యత్తు గురించి చెబుతున్నట్లు గతం గురించి కూడా చెప్పలేరా? " అతడు అడిగాడు.

"కచ్చితంగా చెప్పగలను. కాని గతం మీకు తెలిసిందే కదా. భవిష్యత్తు గురించి తెలుసుకోవడానికే అందరికీ ఆసక్తి"

"నేను చెప్పేది ఈమధ్య కాలంలోని గతం గురించి కాదు. ఆరు కోట్ల సంవత్సరాల క్రితం గురించి- డైనోసార్లు ప్రపంచంలో తిరిగిన రోజుల గురించి..."

అతన్ని వింతగా చూశాడు జోతిష్కుడు. పక్కనే ఉంచిన కళ్లద్దాలు తీసి మళ్ళీ పెట్టుకున్నాడు. జాతక చక్రం మరోసారి చూస్తూ అన్నాడు.

"లేదే.. మీకు మానసిక రోగాలున్నట్లు

జాతకచక్రంలో కనబడటంలేదే. ప్రస్తుతం టైం బాగోలేదంతే..! ఓర్పుతో ఉండండి. రోజూ గుడికెళ్ళి దర్శనం చేసుకోండి"

బయటికి వచ్చాడు. అతనికి కావలసింది జోతిష్కుడు యుగాల వెనక్కు వెళ్ళి, మంచుయుగాల చలిని దాటెళ్ళి భీకరాకారులైన రాక్షస బల్లులు తలెత్తి నడిచిన రోజుల్లోకి వెళ్ళి వివరాలు చెప్పగలడా అనేది. యుగాల తరువాత ఒక డైనోసార్ మళ్ళీ పుట్టింది. ఒక ఆరేళ్ళ పిల్లవాడి పెంపుడు జంతువుగా బ్రతకడానికి- తన మెత్తని నాలికతో వాడి పసిబుగ్గలు నాకడానికి-

జోతిష్కుడు అది అర్థం చేసుకోలేదు.

ఒక వ్యాపారిని కలవాలి. స్టాకు తీసుకోవడం గురించి ఈ రోజు చెబుతానన్నాడు.

అదృష్టం బావుండి అతడు షాపులోనే కనపడ్డాడు. తనని చూసినా చూడనట్లు ముఖం తిప్పుకున్నాడు. ముందు రోజు సాయంత్రం ఇరవై శాతం తక్కువకి స్టాకు తీసుకుంటానన్న మాట గుర్తుచేశాడు.

అనువాదం :
**ఎల్.ఆర్. స్వామి**

"ఓ. అదా... ఆ బేటరీ ఎలిమినేటరుకి డిమాండు లేదయ్యా" వ్యాపారి అన్నాడు. పోనీ నువ్వు అంతగా బతిమాలుతున్నావు కనుక ఒక పని చేయి. ఒక రెండు డజన్లు ఉంచు. అమ్మిన తరువాత డబ్బులిస్తాను"

వెనక్కు నడిచాడు.

"ఇల్లు చూడడానికి ఎవరో వచ్చారండి" ఇల్లు చేరగానే శైలజ అంది.

రెండు నిమిషాల్లో తలుపు తట్టాడు ఒకడు.

"మీరు ఇల్లు ఖాళీ చేస్తారట"

"ఊ"

"ఒకసారి ఇల్లు చూస్తాను"

ఇల్లు మొత్తం తిరిగి చూపించాడు.

"మీకెందుకండి ఇంత ఆతృత" అతడు వెళ్లగానే శైలజ అడిగింది.

"ఇంటిగలాయనకన్నా మీకే ఎక్కువ ఆతృత కనపడుతోంది"

నిజమే! ఎవ్వరైనా ఇల్లు అద్దెకు తీసుకుని అడ్వాన్సు ఇస్తేనే ఇంటిగలాయన మోహన్‌కి చెల్లించిన అడ్వాన్సు తిరిగి ఇస్తాడు. ఆరు కిలోమీటర్ల అవతల కూర్చుని ఏ తాడూ లేకుండా తనను నియంత్రించే ఇంటిగలాయనను మెచ్చుకున్నాడు మోహన్.

ఎప్పటిలాగే ఒక ప్రశ్నతో స్కూల్ నుండి తిరిగి వచ్చాడు రాజీవ్. "స్కూల్లో ఈ రోజు నేనేం చేసానో తెలుసా? డాడీ, నువ్వు చెప్పక"

వాడి ప్రశ్న మమ్మీకే. శైలజ జవాబు చెప్పలేదు. వాడు స్కూల్ బ్యాగు నుండి ఒక కాగితం బయటికి లాగాడు. ఆ కాగితం మీద ఒక పిల్ల డైనోసార్! కుక్క పిల్ల మొఖంలా అందమైన ముఖం- మెరిసే కళ్లు- లావుగా వుండే వెనుక కాళ్లు- ముందుకాళ్ళు పొట్టివి- వేలాడే తోక-

రాజీవ్ ఏం అడుగుతాడో అనే ఆలోచనలో ఉండగా రెండు ఉత్తరాలతో వచ్చింది శైలజ. ఒక ఉత్తరం బేంకు నుండి. పదివేలు చెల్లించాలట! మరో ఉత్తరం డబ్బు అప్పు ఇచ్చినవాడిది. అప్పుగా తీసుకున్న డబ్బు వెంటనే తిరిగి ఇవ్వకపోతే మర్యాదగా ఉండదనే హెచ్చరిక అది.

ఏం చేయాలి? 'కేతు' గొంతు నొక్కి చంపేస్తోంది.

రాజీవ్ వచ్చాడు. వాడి చేతిలో బ్రష్షూ, పెయింటూ ఉన్నాయి.

"డాడీ, ఇప్పుడు నేను ఒక పెద్ద డైనోసార్‌ని గీస్తాను. ఒక కాగితమీయి"

"ఇప్పుడు నన్ను ఏం అడగక! నాకు తలనొప్పిగా ఉంది" మోహన్ విసుగ్గా అన్నాడు.

"ఒక కాగితం ఇస్తే చాలు. ఇంకేం అడగను"

మాట్లాడలేకపోయాడు అతడు.

"డాడీ నిన్నే! కాగితం" మోహన్ని కుదిపి అడిగాడు రాజీవ్.

"వెళ్లమన్నానా? " గట్టిగా కసిరాడు అతడు.

"నువ్వూ నీ డైనోసారూ. ఇంత చెత్త జంతువు తప్ప వేరేం దొరకలేదా నీకు? దాని ముఖం ఎంత అసహ్యంగా వుంటుందో తెలుసా...? "

రాజీవ్ ముఖం వాడింది. మాట్లాడకుండా వంటగది వైపు అడుగులు వేశాడు. మోహన్‌కి రాత్రికి నిద్ర పట్టడం లేదు. డైనోసార్ అతనికి నిద్ర లేకుండా చేసింది. కళ్ళు మూయగానే, ఇరవై అడుగుల ఎత్తైన డైనోసార్‌ని ఒక తాడుతో కట్టి ఆ తాడు పట్టుకొని నడిచి వెళ్ళే పిల్లవాడు కనబడుతున్నాడు. ఎవ్వరూ లేని దారిలో సాగుతున్నాడు వాడు. ఆ జంతు వేసిన ప్రతి అడుగుకీ భూమి అదురుతోంది. ఎంత నడిచినా రోడ్డు స్వభావం మారటంలేదు. ఒకేలాంటి అనంతమైన దారిలో వాళ్ళు సాగుతున్నారు. ఆ నడక చూస్తూ వుంటే యాభై వేల నష్టం కాని, ఒకటో తారీకు నుండి ఉండడానికి ఇల్లు లేదనేది కాని సమస్యలుగా తోచలేదు.

కొత్త ఇల్లు గురించి చాలా కోరికలు ఉండేవి రాజీవుకి. ఆ ఇంటి మేడమీద గదులు లేవు కనుక వాడి పడక గది కూడా కిందనే. దానివల్ల పిల్లడైనోసార్‌కు సమస్యలుంటాయని అన్నాడు వాడు. క్రింద గది కిటికీలో నుండి వంగి చూస్తే దాని మెడకి నొప్పి వస్తుందట.

ఆ సమస్యకు ఒక పరిష్కారం సూచించాడు మోహన్.

డైనోసార్ తన పొట్ట నేల మీద ఆన్చి పడుకుని చూస్తే నొప్పి ఉండదని అన్నాడు.

వాడి గదిలోని కిటికీ అవతల దోమలు ముసిరే ఒక కుళ్ళు కాలువ ఉందని ఆ కాలువ అవతల బాగా రద్దీగా ఉండే ఒక సందు ఉందని వాడికి చెప్పలేదు.

సాధారణంగా వాడు ఒంటరిగానే పడుకుంటాడు. కాని ఒకరోజు శైలజ వద్దకు వచ్చి అడిగాడు. "మమ్మీ నేను నీ దగ్గరే పడుకుంటాను"

"అదేంటీ ఈ రోజు ఇలా..." శైలజ ఆశ్చర్యంగా చూసింది.

"నేను హార్డిబాయిస్ ది మిస్టరీ బుక్కు చదివాను మమ్మీ..."

"వేరే పుస్తకమేమీ దొరకలేదా... పోనీ భయం లేదు నాన్నా... వెళ్ళి పడుకో..."

భయంభయంగా వెళ్లాడు వాడు.

కళ్ళు మూసుకున్నా నిద్ర పట్టడంలేదు మోహన్‌కి. జోతిష్కుడు, తనకు చివరి నిమిషంలో నిరాశపరచిన వ్యాపారి, తనకు దొంగ ఆర్డర్లు చూపించి మోసం చేసిన ఢిల్లీవాడు అప్పు ఇచ్చినవాళ్ళు వాళ్ళ ఉత్తరాలు అన్నీ మనసులో కదిలాయి.

శైలజ నిద్రపోయింది. రాజీవ్ గదిలోకి వెళ్ళి మెల్లగా లైటు వేశాడు. ఒక తలగడను పట్టుకుని నిద్రపోతున్నాడు వాడు.

చుట్టూ నలువైపులా తలగడలు వేసుకున్నాడు. అది వాడి కోట అట. ఆ కోట లోపల వాడికి భయం లేదట!

దిండు పక్కనే వుంది, వాడు గీసిన డైనోసార్ బొమ్మ. దాని ముఖానికి రంగు వేసి అందంగా చేయడానికి ప్రయత్నించినట్టు కనపడింది. ఒకసారి వంగి రాజీవ్ బుగ్గ మీద ముద్దుపెట్టాడు అతడు. ఆ తరువాత ఆ బుగ్గలను మెల్లగా నాకాడు.

కిటికీ అవతల నిలబడి తదేకంగా వాడ్ని చూస్తూ స్నేహపూర్వకంగా వాడి బుగ్గలను నాకే పిల్ల డైనోసార్ పట్ల అసూయ కలిగింది మోహన్‌కి. తను రాత్రంతా వాడికి కాపలా కాసే డైనోసార్‌గా మారితే ఎంత బాగుంటుంది అని అనుకున్నాడు. V